సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 7 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.32 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.32 వేలు, కనిష్టంగా రూ.15 వేలు, సరాసరిన రూ.25 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.30

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.30, కనిష్టంగా రూ.13, సరాసరిన రూ.25 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం

33.8°/16.6°

జిల్లాలో బుధవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

'లోక్ అదాలత్'ను సద్వినియోగం చేసుకోండి



జి. శ్రీనివాస్ జిల్లా జడ్జి

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కోర్టుల్లో డిసెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు జి. శ్రీనివాస్ సూచించారు. జిల్లా కోర్టులోని తన కార్యాలయంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్ ఇచ్చే తీర్పులు సుప్రీం కోర్టు తీర్పులతో సమానమన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని కోర్టుల్లోనూ డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్‌ను ఏకకాలంలో నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 13 ప్రాంతాల్లో 26 బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే న్యాయమూర్తుల నియామకం పూర్తి చేశామన్నారు. గత లోక్ అదాలత్‌లో 6 వేల కేసులు పరిష్కరించామని, ఈ అదాలత్‌లో 5 వేల కేసులు పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. జాతీయ లోక్ అదాలత్ వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయన్నారు. రాజీ చేయదగిన కేసులన్నీ పరిష్కరిస్తామన్నారు. తీర్పు వల్ల కక్షిదారుడు ఒక్కరే విజయం సాధిస్తే.. లోక్ అదాలత్‌లో ఇరు వర్గాలు రాజీకావడంతో ఇరువురు విజయం సాధించినట్లేనని పేర్కొన్నారు. సివిల్ కేసుల్లో రాజీ పడితే కోర్టు ఖర్చులు వాపస్ చేస్తామన్నారు.

వారంలో నాలుగు రోజులు గ్రామ సభలు

ప్రశాంతి నిలయం: భూ సమస్యల పరిష్కారానికి వారంలో నాలుగు రోజులు గ్రామాల్లో తహసీల్దార్ అధ్యక్షతన సభలు నిర్వహించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి పీజీఆర్ఎస్-ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాల ముందస్తు ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గ్రామ సభల్లో ప్రజల భాగస్వామ్యం ఉండాలన్నారు. ప్రతి పంచాయతీకి ప్రత్యేకంగా షెడ్యూల్ సిద్ధం చేయాలన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రామ సభ నిర్వహించాలన్నారు. సభల్లో అందే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ విజయసారథి, పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ చికిత్సల్లో మూడో వంతుకు పైగా కోతవేసి.. పేదల వైద్యం ఖర్చును భారీగా తగ్గించుకునేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఆరోగ్యశ్రీకి కోట్లాది రూపాయలు వ్యయం చేయడం సరి కాదనే భావనలో ప్రభుత్వ పెద్దలు ఉన్నట్టు తెలుస్తోంది. కేవలం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ (అభా) పథకంలో ఉన్న జబ్బులకు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం కూడా చికిత్సలు అందించి, చేతులు దులుపుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం.



పేదలపై ఆరోగ్య భారం!

ఉమ్మడి అనంతలో ప్రస్తుతం ఆరోగ్యశ్రీ వివరాలు ఇలా	
జనాభా	42,00,000
ఆరోగ్యశ్రీలో చికిత్సల సంఖ్య	3,256
అభాలో ఉన్న చికిత్సలే అయితే	1,949
ప్రైవేటులో నెట్‌వర్క్ ఆస్పత్రులు	56
ప్రభుత్వ పరిధిలో నెట్‌వర్క్ ఆస్పత్రులు	96
ఆరోగ్యశ్రీ కింద ఏడాదికి లబ్ధిదారులు	1,90,000 వరకు
ఏడాదికి చేస్తున్న వ్యయం	రూ.300 కోట్లు
క్యాన్సర్, హార్ట్, ఆర్థో కేసులు	40 శాతం

- సామాన్యుల వైద్యంపై వ్యయాన్ని తగ్గించాలని సర్కారు ఆలోచన
- కేంద్ర ప్రభుత్వ పథకాన్నే అమలు చేసేందుకు కసరత్తు
- 'అభా' పరిధిలో 1,949 ప్రొసీజర్లు మాత్రమే
- 'ఆరోగ్యశ్రీ' పరిధిలో 3,256 రోగాలకు వైద్యం
- ప్రభుత్వ చర్యలపై సామాన్యుల్లో తీవ్ర భయాందోళన
- మళ్లీ పాతరోజులొస్తాయని చర్చ
- ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు వైద్యం ప్రశ్నార్థకం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: వైఎస్ జగన్ సర్కారు హయాంలో 3,256 రకాల జబ్బులకు ఏ కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లినా ఎటువంటి ఆటంకాలు లేకుండా చికిత్స చేసేవారు. కానీ.. ఇప్పుడు ఆయుష్మాన్ భారత్‌లో ఉన్న 1,949 జబ్బులకే చికిత్స అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని లక్షల మంది ప్రజలకు ఉచిత వైద్యం ప్రశ్నార్థకం కాబోతోంది.

1,307 చికిత్సల మాటేమిటి

గత ప్రభుత్వ హయాంలో 3,256 వైద్య చికిత్సలు ఆరోగ్యశ్రీ పరిధిలో ఉండేవి. కానీ, నేడు 'అభా' పరిధిలో ఉన్న 1,949 చికిత్సలను మినహాయిస్తే మిగతా 1,307 చికిత్సలకు వైద్యం ఎలా అన్నదే సందేహంగా మారింది. ఈ వ్యాధులు అరుదుగా రావచ్చు కానీ వచ్చినప్పుడు మాత్రం ఆరోగ్యశ్రీలో ఎలాంటి ఆందోళన లేకుండా వైద్యం చేయించుకుంటున్నారు. కానీ, నేడు అరుదైన జబ్బుల పేరుతో ఎత్తేస్తే వైద్యానికి ఎక్కడికెళ్లాలని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా కరోనా, డెంగీ కేసులను కూడా ఆరోగ్యశ్రీలో చేర్చి పైసా ఖర్చు లేకుండా గత సర్కారు వైద్యం చేయించింది. భవిష్యత్తులో పరిస్థితి ఏమిటన్నది అంతుచిక్కడం లేదు.

పాతరోజుల భయం..

2014–19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ సర్కారు ఆరోగ్యశ్రీని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్న విమర్శలు వచ్చాయి. ఏపీలో క్యాన్సర్ చికిత్సకు అవకాశం లేకపోవడం, బయటి రాష్ట్రాల్లో అనుమతి ఇవ్వకపోవడం వంటి ఘటనలతో ఎంతోమంది రోగులు మృతి చెందారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు నిధులు చెల్లించకపోవడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేలాది మంది వైద్యం అందక విలవిలలాడారు. ఇప్పుడూ అదే పరిస్థితి వస్తుందేమోనని జిల్లావాసులు భయపడుతున్నారు.

సేవలు కుదించడం దారుణం



ఆరోగ్యశ్రీ పేదల పాలిట సంజీవనిలా పనిచేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్ 'ఆరోగ్య శ్రీ' సేవలను మరింత విస్తరించి నిరుపేదల ఆరోగ్యానికి భరోసా ఇచ్చారు. అందుకే ఏ జబ్బు చేసినా పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొందేవాళ్లం. కానీ కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ సేవలను కుదించేందుకు సిద్ధం కావడం దారుణం. కేంద్రం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ కింద ఉన్న 1,942 సేవలనే అందించాలనుకోవడం దుర్మార్గం.

– నరసింహమూర్తి, హేరేసముద్రం, మడకశిర మండలం

ప్రభుత్వ నిర్ణయం సరికాదు



గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ వైద్యసేవలు సక్రమంగా అందేవి. అన్ని వ్యాధులకు విస్తరింపజేసి పేద ప్రజలకు సకాలంలో వైద్యసేవలు అందించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ వైద్య సేవలు కుదించే ప్రయత్నం చేయడం సరి కాదు. ప్రభుత్వం యథావిధిగా ఆరోగ్యశ్రీ వైద్య సేవలు కొనసాగిస్తే పేద ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. ఆరోగ్యశ్రీ సేవలపై కూటమి ప్రభుత్వం మరోసారి ఆలోచించాలి.

– నాగభూషణం, ఓబుళాపురం, బత్తలపల్లి మండలం



రూ.200 నోటును పోలిన కలర్ జిరాక్స్



కలర్ జిరాక్స్ తీసిన నోటులోని వెనక భాగం

కరెన్సీ కాదు.. కలర్ జిరాక్స్!

బత్తలపల్లి: టెక్నాలజీ మహిమ..అంతా మాయ. కాస్త ఏమరుపాటుగా ఉంటే ఇట్టే మోసం చేస్తున్నారు. తెలివిమీరిపోయిన కొందరు కేటుగాళ్లు... బత్తలపల్లిలోని చిరు వ్యాపారులకు టోకరా వేశారు. రూ.10 విలువైన వస్తువులు కొని రూ.200, రూ.500 నోట్లు ఇచ్చి మిగిలిన చిల్లర తీసుకుని మరీ వెళ్లారు. ఆ నోట్లు తీసుకుని బ్యాంకులకు వెళ్లిన చిరువ్యాపారులు అవి కలర్ జిరాక్స్ పేపర్లు అని తెలిసి లబోదిబోమంటున్నారు. మోసాలు ఇటీవల బత్తలపల్లిలోనే ఎక్కువగా వెలుగుచూస్తున్నాయి. కూడలిలో ఆటోవాలాకు ఓ వ్యక్తి ఇలాగే కలర్ జిరాక్స్ నోటు ఇచ్చాడు. అలాగే జొన్నరొట్టెలు విక్రయించే వృద్ధురాలినీ ఓ ఆగంతకుడు ఇలాగే మోసం చేశాడు. కలర్ జిరాక్స్ నోట్ల బాధితుల్లో ఎక్కువగా చిరు వ్యాపారులే ఉండటం గమనార్హం. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సొంత అవసరాలకు ఇసుక ఉచితం



మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్, చిత్రంలో ఎస్పీ రత్న, జేసీ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: సొంత అవసరాలకు ఇసుకను ట్రాక్టర్లు, ఎద్దులబండ్లపై ఉచితంగా తీసుకువెళ్లవచ్చని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాలులో జిల్లాలో 'ఉచిత ఇసుక' అమలుపై డీఎల్ఎస్‌సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇసుక బుకింగ్‌పై గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. డిజిటల్ అసిస్టెంట్ లేదా పంచాయతీ సెక్రటరీకి ఇసుక బుకింగ్ రిజిస్ట్రేషన్ బాధ్యతలు అప్పగించాలన్నారు. వాగులు, వంకలు సమీపాల్లోని గ్రామాల వారు తమ సొంత అవసరాలకు ఇసుకను ఉచితంగా తీసుకువెళ్లవచ్చన్నారు. రీచ్‌లలోనూ సొంతంగా లోడ్ చేసుకుంటే చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఇసుక రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ అమర్చాలన్నారు. జిల్లా శాండ్ నోడల్ అధికారిగా జాయింట్ కలెక్టర్‌ను నియమించామని, కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం, హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామన్నారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ, జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు రోజూ దాడులు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు కూడా ఇసుక అక్రమ రవాణాపై 100, 102కి ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, గనుల శాఖ అధికారి పెద్దిరెడ్డి, ఆర్డీఓ కరుణ సాగర్‌రెడ్డి, జలవనరుల శాఖ అధికారి మల్లికార్జునయ్య, ధర్మవరం ఆర్డీఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి ఏఎస్ఐపై సస్పెన్షన్ వేటు

- చిలమత్తూరు గ్యాంగ్ రేప్ కేసు నిందితులకు సహకారం ఫలితం



సస్పెండైన ఏఎస్ఐ హిదాయతుల్లా

పరిగి: అసాంఘిక శక్తులతో అంటకాగిన పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. చిలమత్తూరులో జరిగిన గ్యాంగ్ రేప్ ఘటనలో నిందితులకు సహకరించారన్న కారణంతో ఇప్పటికే హిందూపురంలోని ఇద్దరు కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకున్నారు. తాజాగా బుధవారం పరిగి ఏఎస్ఐ హిదాయతుల్లాను సస్పెండ్ చేస్తూ ఎస్పీ రత్న ఉత్తర్వులు జారీ చేశారు. గ్యాంగ్ రేప్ నిందితులపై గతంలోనే వివిధ కేసులు నమోదయ్యాయి. అప్పట్లో హెడ్‌కానిస్టేబుల్ హోదాలో హిదాయతుల్లా వారికి సహకరించినట్లు తెలుస్తోంది. దీంతో ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేశారు. విచారణలోనూ ఆరోపణలు రుజువుకావడంతో ఎస్పీ చర్యలు తీసుకున్నారు. కాగా మరికొందరు పోలీసులపై వేటు పడే అవకాశం ఉందన్న నేపథ్యంలో నిందితులతో సత్సంబంధాలు నెరిపిన పోలీసు సిబ్బంది గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.



భావ ప్రకటనపై ఉక్కుపాదం

ప్రశ్నిస్తే... అరెస్టులే

- వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా టార్గెట్
- అమాయకులపై పోలీసులను ఉసిగొల్పిన ప్రభుత్వం
- ప్రభుత్వ చర్యలను తూర్పారబడుతున్న ప్రజాస్వామ్యవాదులు

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన హక్కులను హరిస్తోంది. ప్రశ్నించే వారిపై ఉక్కుపాదం మోపుతోంది. హామీలు అమలు చేయాలంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన పాపానికి వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేయిస్తోంది. సోషల్ మీడియా పోస్టులపై అరెస్టులు తగదని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా లెక్కచేయడం లేదు. అధికారం అండతో పోలీసులను ఉసిగొల్పి తీవ్రంగా వేధిస్తోంది. తద్వారా తమను ప్రశ్నించే వారందరికీ ఓ హెచ్చరిక జారీ చేస్తోంది. పౌరహక్కులపై కూటమి సర్కార్ చేస్తున్న దాడిని ప్రజాస్వామిక వాదులు తప్పుబడుతున్నారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన పాలకులే తూట్లు పొడవడం తగదని హితవు పలుకుతున్నారు.

– సాక్షి బృందం

ఇంట్లోంచి లాక్కెళ్లారు



నేను బుధవారం మధ్యాహ్నం కూలి పనుల నుంచి ఇంటికొచ్చే సరికి పోలీసులు నా కుమారుడు ఆంజనేయులు (అంజి వాల్మీకి)ను లాక్కెళ్తున్నారు. ఎందుకని అడిగితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏందో పోస్టులు పెట్టాడని చెబుతున్నారు. అడ్డుకోబోయిన నన్ను వృద్ధురాలినని కూడా చూడకుండా పక్కకు నెట్టేశారు. నా బిడ్డను ఏం చేస్తారోనని భయంగా ఉంది. నా బిడ్డలాగే రాష్ట్రంలోని జనమంతా చంద్రబాబును అడుగుతున్నారు..వారందరినీ అరెస్టు చేస్తారా..?

– శంకరమ్మ, కె పూలకుంట, నల్లచెరువు మండలం

అక్రమంగా అరెస్ట్ చేశారు



నా కుమారుడు అమరనాథ్‌రెడ్డి బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటున్నాడు. 'పోలవరం కట్టడం అసాధ్యం' అని ప్రపంచ బ్యాంక్ చెప్పిన విషయాన్ని నా కుమారుడు సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఇందులో ఏం తప్పుంది..? అయినా అధికార పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడాడని రెండు రోజుల క్రితం పోలీసులు తప్పుడు కేసు పెట్టి అరెస్ట్ చేశారు. బెయిల్‌పై బయటకు రాగా, సెల్‌ఫోన్ ఇస్తామని ఈ రోజు మళ్లీ స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. ఇది మంచిది కాదు. ఇప్పటికైనా అక్రమ అరెస్టులు ఆపాలి.

– గంగిరెడ్డి, వీరచిన్నయ్యగారిపల్లి, కదిరి మండలం

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం



రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది. పోలీసులు కూడా టీడీపీ నేతల రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. నా కుమారుడు బాలాజీరెడ్డి 2022లో చంద్రబాబుపై ఏదో పోస్టు సోషల్ మీడియాలో పెట్టాడని రెండు రోజుల క్రితం అర్ధరాత్రి వేళ పోలీసులు మా ఇంటికి వచ్చారు. మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేసి బాలాజీని తీసుకువెళ్లి ఐటీ యాక్ట్ కింద కేసు పెట్టారు. టీడీపీ నాయకులు పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుంటే అడ్డుకున్నందుకే కేసులు పెట్టి బెదిరించడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రశ్నిస్తే అరెస్టు చేయడం దుర్మార్గం.

– వెంకటరామిరెడ్డి, నాగిరెడ్డిపల్లి, రొద్దం మండలం

హక్కులను హరిస్తున్నారు



ప్రతి ఒక్కరికీ భావ ప్రకటన హక్కు ఉంటుంది. దాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. కానీ ఈ ప్రభుత్వాలే హక్కులను కాలరాస్తున్నాయి. సోషల్ మీడియా పోస్టులపై అరెస్టు తగదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా రాష్ట్రంలోని పోలీసులు పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సోషల్ మీడియా వేదికగా నా భర్త మెగా అంజాద్ ప్రశ్నించారు. దీన్ని సహించలేక పోలీసులతో అక్రమంగా అరెస్టు చేయించారు. నా భర్త లాగే ఎందరో సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. ఇది ముమ్మాటికీ పౌర హక్కులపై దాడే. ప్రభుత్వ చర్యలను న్యాయ పరంగా ఎదుర్కొంటాం.

– మునవర్, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కో కన్వీనర్ మెగా అంజాద్ భార్య

ప్రశ్నిస్తే కేసులు పెడతారా?



ఎన్నికల ముందు అలివిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబును...ఆ హామీలను అమలు చేయమని ప్రశ్నించినందుకు మాపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. చంద్రబాబు హామీలు గుర్తు చేస్తూ వాటిని అమలు చేయాలంటూ కేవలం వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు పెట్టిన నాపై కళ్యాణదుర్గం అర్బన్ పోలీసు స్టేషన్‌లో పి.శ్రీరాములు అనే టీడీపీ కార్యకర్త కేసు పెట్టారు. ప్రశ్నించడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు. ఇలాంటి కేసులకు భయపడేది లేదు. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చేదాకా ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాం.

– లక్ష్మణ మూర్తి, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త, శెట్టూరు

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్ట్



అంజి వాల్మీకి

నల్లచెరువు: ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పాపానికి వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కె.పూలకుంటకు చెందిన పిచ్చుక ఆంజనేయులు (అంజి వాల్మీకి) వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తగా ఉంటున్నారు. రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలంటూ గతంలో ఓ పోస్టు పెట్టాడు. తాజాగా బుధవారం నల్లచెరువు పోలీసులు కె.పూలకుంటలోని పిచ్చుక ఆంజనేయులు ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో అతను కూలి పనులు చేసేందుకు పొలం వెళ్లగా...మధ్యాహ్నం వరకూ అతని ఇంటివద్దే వేచి చూశారు. ఆంజనేయులు ఇంటికి రాగానే అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కదిరి డీఎస్పీ కార్యాలయానికి తరలించారు.

కామెంట్ చేసినందుకు...

ఉరవకొండ: కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుకు కామెంట్ పెట్టిన బెళుగుప్ప మండలం నక్కలపల్లి గ్రామానికి చెందిన యు. సంజీవరెడ్డిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. బాధితుడి తల్లి సుంకమ్మ తెలిపిన వివరాల మేరకు.. పుట్టపర్తికి చెందిన ఓ యువకుడు సీఎం చంద్రబాబుకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టాడు. బెళుగుప్ప మండలం నక్కలపల్లి గ్రామానికి చెందిన సంజీవరెడ్డి సదరు పోస్టును ట్యాగ్ చేసి కామెంట్ చేశాడు. దీంతో పుట్టపర్తి పోలీసులు బుధవారం బెళుగుప్పకు చేరుకుని ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఇంటి వద్ద నుంచి నేరగాడిలా ప్రత్యేక వాహనంలో పుట్టపర్తికి తరలించారు. తన కొడుకును ఎందుకు తీసుకెళుతున్నారో చెప్పండి అంటూ తల్లి సుంకమ్మ కాళ్లావేళ్లా పడినా పోలీసులు కరుణించలేదు.

క్లుప్తంగా

'అపార్' కష్టాలు తొలగించాలి

- వైఎస్సార్‌టీఏ డిమాండ్

పుట్టపర్తి: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన విద్యార్థుల అపార్ నమోదు ప్రక్రియ నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలంటూ ప్రభుత్వాన్ని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వివిధ రకాల యాప్‌లను కూటమి సర్కార్ ప్రవేశపెట్టి ఉపాధ్యాయులపై తీవ్రమైన ఒత్తిడి పెంచిందన్నారు. ఆయా యాప్‌ల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కల్పించాలన్నారు. రెసిడెన్షియల్ ఎఫ్ఎల్ఎన్ శిక్షణా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎఫ్ఎల్ఎన్ శిక్షణలో పాల్గొని మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. పీఆర్సీ, పెండింగ్ బకాయిలు, కరువు భత్యం బకాయిలు వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

టమాట రైతులు బీమాను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: రబీ సీజన్‌లో టమాట పండించే రైతులు పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. 'ఇఫ్‌కో–టోకియో' కంపెనీకి టమాటకు బీమా ఇస్తుందని, ఎకరాకు రూ.32 వేల వరకూ బీమా వర్తిస్తుందన్నారు. ఇందుకోసం 10 శాతం అంటే రూ.3,200 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రీమియంలో కేంద్ర ప్రభుత్వం రూ.800, రాష్ట్ర ప్రభుత్వం రూ.800 చొప్పున చెల్లిస్తాయని, రైతు తన వాటాగా రూ.1,600 చెల్లిస్తే సరిపోతుందన్నారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్ట్

తలుపుల: మండలంలోని ఏపులపల్లి అటవీ ప్రాంతంలో కోడి పందెం నిర్వహిస్తున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ నాగేంద్ర కుమార్ తెలిపిన మేరకు... అందిన సమాచారం మేరకు బుధవారం ఉదయం ఏపులపల్లి అటవీ ప్రాంతంలో పోలీసులు తనిఖీలు చేపట్టారన్నారు. ఆ సమయంలో కోడి పందెం ఆడుతున్న పలువురు పోలీసులను గమనించి పారిపోతుండగా వెంటాడి 20 మందిని అదుపులోకి తీసుకున్నారు. 20 ద్విచక్ర వాహనాలు, 20 సెల్‌ఫోన్లు, 8 కోళ్లు, రూ.60,200 నగదు స్వాధీనం చేసుకుఆన్నరు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థాయంలో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంతకల్లు రూరల్: సంతానం కలుగక పోవడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు... గుంతకల్లులోని దోనిముక్కల రోడ్డులో ఉన్న ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న ఈశ్వర ప్రసాద్ (36)కు 12 ఏళ్ల క్రితం వివాహమైంది. బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్నాడు. సంతానం కలగకపోవడంతో పలు ఆస్పత్రుల్లో దంపతులు చికిత్స చేయించుకున్నారు. అయినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో తీవ్ర మనోవేదనకు లోనైన ఈశ్వర ప్రసాద్ మంగళవారం అర్ధరాత్రి తన భార్య ఆదిలక్ష్మి నిద్రిస్తుండగా పురుగుల మందు తాగాడు. విషయాన్ని పసిగట్టిన ఆదిలక్ష్మి వెంటనే భర్తను గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లింది. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు ఆగమేఘాలపై అనంతపురానికి తరలించారు. చికిత్సకు స్పందించక బుధవారం సాయంత్రం ఈశ్వర్ ప్రసాద్ మృతిచెందాడు. ఘటనపై గుంతకల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చేజారిన 'పట్టు'!

- వాతావరణ మార్పులతో తగ్గిన పట్టు గూళ్ల దిగుబడులు
- హిందూపురం మార్కెట్‌కు నాలుగు టన్నులకు మించి రాని వైనం


హిందూపురం మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన పట్టు గూళ్లు

హిందూపురం అర్బన్: వాతావరణంలో మార్పులు పట్టుగూళ్ల దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. చలి తీవ్రతకు మల్బరీ ఆకులో తేమ శాతం పెరిగింది. పట్టు పురుగుల్లో సున్నపుకట్టు వ్యాధి ప్రబలి దిగుబడులు గణనీయంగా తగ్గాయి.

రాష్ట్రంలోనే అతి పెద్ద మార్కెట్..

రాష్ట్రంలోనే అతి పెద్ద మార్కెట్‌గా హిందూపురంలోని పట్టుగూళ్ల మార్కెట్‌కు పేరుంది. ఇక్కడ రోజూ 9 నుంచి 12 టన్నుల వరకూ పట్టు గూళ్లను విక్రయానికి రైతులు తీసుకువచ్చేవారు. ఉమ్మడి జిల్లాలోని రీలర్లతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు చెందిన రీలర్లు పెద్ద సంఖ్యలో ఇక్కడకు వచ్చి పట్టుగూళ్లను కొనుగోలు చేసేవారు. ఆన్‌లైన్ విధానంలో పట్టుగూళ్ల ధరలు నిర్ణయించే విధానంతో రైతులకు కొంత మేలు జరుగుతోంది. ఈ విధానం అందుబాటులోకి వచ్చిన తర్వాత డిమాండ్ కూడా పెరిగింది. ఇలాంటి తరుణంలో పట్టుగూళ్ల దిగుబడులు తగ్గడంతో లావాదేవీలపై తీవ్ర ప్రభావం పడింది. ప్రస్తుతం రోజూ మార్కెట్‌కు 1.5 టన్నుల నుంచి 4 టన్నుల వరకు మాత్రమే పట్టుగూళ్లను విక్రయాలకు తెస్తున్నారు.

నాణ్యతపై ప్రభావం..

వాతావరణంలో తేమ శాతం పెరిగితే ప్రధానంగా మల్బరీ పంటలో పచ్చ పురుగు, బూజుకట్టు రోగం ఉధృతి పెరుగుతుంది. పంట చివరి దశలో పట్టు పురుగులకు సున్నపు కట్టు వ్యాధి సోకడంతో ట్రేలలోనే అవి చనిపోతున్నాయి. ఇక గుడ్డు అల్లకం సమయంలో చంద్రికల్లోనూ పురుగులు చనిపోతున్నాయి. దీంతో నాణ్యత లేని పట్టు గూళ్లు మార్కెట్‌కు వస్తున్నాయి. 6 కిలోల పట్టు గూళ్లకు ఒక కిలో సిల్క్ వస్తే రీలర్లకు గిట్టుతుంది. లేకపోతే నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. దీంతో మార్కెట్‌కు వస్తున్న నాణ్యత లేని పట్టుగూళ్లను తక్కువ ధరతో కొనుగోలు చేసేందుకు రీలర్లు మొగ్గు చూపుతున్నారు.

దిగుబడి తగ్గింది



పది రోజులుగా రాత్రి సమయంలో చలి గాలులు పెరిగాయి. దీంతో సున్నపు కట్టు వ్యాధి సోకి పట్టు పురుగులు చనిపోతున్నాయి. చంద్రికల్లో ఉన్న పురుగులు గూడు అల్లకుండా నిలిచిపోయి సున్నపు కట్టుగా మారుతున్నాయి. దీంతో ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదు. మార్కెట్‌లో కిలో రూ.600 చొప్పున ధర ఉన్నా.. దిగుబడులు లేకపోవడంతో నష్టపోతున్నాం.

– రైతు శశికుమార్, దాసరపల్లి, గుడిబండ మండలం

గిట్టుబాటు ధర లేదు



మార్కెట్‌కు నాణ్యమైన ఆరిన పట్టుగూళ్లు తీసుకు వస్తే కిలో రూ.603తో కోట్ చేశారు. ఈ ధర నచ్చక రెండో వేలానికి సిద్ధమయ్యా. ధర కాస్త పెరిగితే అమ్మేస్తా. మార్కెట్‌కు ఒక రోజు తక్కువ, మరో రోజు ఎక్కువ గూళ్లు వస్తున్నాయి. దీంతో ధరలపై ప్రభావం పడుతోంది.

– రైతు ఈశ్వరప్ప, ఎనుముల దొడ్డి, కుందుర్పి మండలం

నాణ్యత లేవు



మార్కెట్‌కు వస్తున్న పట్టుగూళ్లలో సగానికి సగం నాణ్యత లోపించినవే ఉంటున్నాయి. పూర్తిగా చంద్రికల్లోనే ఆరిన గూళ్లు పీకి మార్కెట్‌కు తీసుకు వస్తే అందులో దారం ఎక్కువ వస్తుంది. మేము కూడా ఆ గూళ్లపై రూ.10 ఎక్కువ ఇచ్చేందుకు వీలుంటుంది.

– నజీర్, రీలర్, చిక్‌బళ్లాపురం, కర్ణాటక

'కౌశల్' పోటీలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి


పోస్టర్లు విడుదల చేస్తున్న డీఈఓ కిష్టప్ప, సిబ్బంది

పుట్టపర్తి: భారతీయ విజ్ఞాన మండలి ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే కౌశల్ ప్రతిభాన్వేషణ పోటీలకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డీఈఓ కిష్టప్ప సూచించారు. బుధవారం ఆయన కొత్తచెరువులోని తన కార్యాలయంలో కౌశల్ ప్రతిభాన్వేషణ పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక్కో తరగతి నుంచి ముగ్గురు చొప్పున 8, 9, 10వ తరగతుల విద్యార్థులు 9 మందిని ఎంపిక చేసి వారి వివరాలను 15వ తేదీలోపు పంపాలన్నారు. కౌశల్ రాష్ట్ర సమన్వయకర్త శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ, www. bvmap. org పోర్టల్‌లో విద్యార్థుల వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 20, 21, 22 తేదీల్లో ఆన్‌లైన్‌లో పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు మొదటి బహుమతి కింద రూ.4,500, రెండో బహుమతి కింద రూ.3 వేలు నగదు అందిస్తారని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో కౌశల్ కోఆర్డినేటర్ భాస్కర్, ఏడీలు నాగరాజు, రామకృష్ణ, లాజర్‌తోపాటు ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, ఇర్షాద్‌వలి, సిబ్బంది పాల్గొన్నారు.

క్షణాల్లో ఆవిరైన ఆనందం

- రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో రాణించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన కుమార్తె
- పోటీలు ముగించుకుని మంగళవారం ధర్మవరానికి చేరుకున్న వైనం
- కుమార్తెను పిలుచుకెళుతుండగా ప్రమాదం
- ఘటనలో మృతి చెందిన విద్యార్థిని.. తండ్రికి తీవ్ర గాయాలు


సాయి భవిత (ఫైల్)

పెనుకొండ రూరల్/పెనుకొండ: రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో రాణించిన కుమార్తెను చూసి ఆనందించిన ఆ తండ్రి సంతోషం క్షణాల్లోనే ఆవిరైంది. పోటీలను ముగించుకుని ధర్మవరానికి చేరుకున్న కుమార్తెను పిలుచుకుని ఇంటికి వెళుతున్న సమయంలో బొలెరో వాహనం రూపంలో మృత్యువు కబళించింది. విషయం తెలియగానే పెనుకొండలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలు.... ధర్మవరానికి చెందిన రమేష్, మల్లిక దంపతులకు సాయి భవిత (15), తనుశ్రీ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రొద్దంలోని జెడ్పీహెచ్ఎస్‌లో రమేష్ పీఈటీగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో పెనుకొండకు తన నివాసాన్ని మార్చి రోజూ రొద్దం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్లి వచ్చేవారు. పెద్ద కుమార్తె సాయి భవిత పెనుకొండలోని శాంతినికేతన్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. హాకీపై మక్కువ చూపడంతో ఆమెను ఆ దిశగా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తూ వచ్చారు. ఈ క్రమంలో జిల్లా స్థాయిలో మెరుగైన ప్రతిభ కనబరిచి ఇటీవల రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించే జిల్లా జట్టులో చోటు దక్కించుకుంది. దీంతో ఎంతో సంతోషపడిన తల్లిదండ్రులు ఆమెను నెల్లూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలకు పంపారు. కుమార్తె ఆటతీరును ప్రత్యక్షంగా చూడాలనే ఆకాంక్షతో రమేష్ కూడా నెల్లూరుకు వెళ్లారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన సాయి భవితను జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టుకు సెలెక్టర్లు ఎంపిక చేశారు. ఈ మొత్తం ప్రక్రియ ముగిసిన తర్వాత నెల్లూరు నుంచి రైలులో బయలుదేరిన వారు మంగళవారం అర్ధరాత్రి తర్వాత ధర్మవరానికి చేరుకున్నారు. బుధవారం ఉదయం కుమార్తెను పిలుచుకుని ధర్మవరం నుంచి ద్విచక్ర వాహనంపై రమేష్ పెనుకొండకు బయలుదేరారు. మార్గ మధ్యంలో పెనుకొండ మండలం గుట్టూరు సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన తండ్రి, కుమార్తెను స్థానికులు వెంటనే గుట్టూరులోని పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సాయి భవితను బెంగళూరుకు తీసుకెళుతుండగా మార్గ మధ్యంలో మృతి చెందింది. రమేష్‌ను అనంతపురానికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు కియా ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. కాగా, విషయం తెలియగానే మంత్రి సవిత దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఓ మంచి విద్యార్థి, క్రీడాకారిణిని కోల్పోవడం బాధాకరమంటూ ఓ ప్రకటన విడుదల చేశారు.

డీలర్‌పై టీడీపీ నాయకుల దౌర్జన్యం

అమరాపురం: మండలంలోని వైజీ పల్లి గ్రామ ప్రభుత్వ చౌకధాన్యపు డీలర్ విధులను టీడీపీ నాయకులు అడ్డుకుని దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఘటనపై బాధిత డీలర్ శిల్ప తెలిపిన మేరకు... గత ఐదేళ్లుగా తన పరిధిలోని లబ్ధిదారులకు నిత్యావసర సరుకులను శిల్ప సక్రమంగా అందజేస్తూ వస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత డీలర్‌షిప్‌ను వదులుకోవాలని ఆమెపై కూటమి నేతలు ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో బెదిరింపులకు దిగారు. దీంతో ఆమె హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చారు. అయితే మంగళవారం సాయంత్రం లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేస్తున్నప్పుడు టీడీపీ నాయకులు దౌర్జన్యానికి తెగబడ్డారు. అడ్డుకోబోయిన డీలర్ శిల్ప భర్త శివలింగప్పను దుర్భాషలాడారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులం కావడం మూలంగానే టీడీపీ నేతలు దౌర్జన్యానికి దిగుతున్నారంటూ బాధితురాలు వాపోయింది.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక


వర్షిత

అనంతపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ (400 మీటర్లు)లో గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎ.వర్షిత ఎంపికైంది. గుంతకల్లు మండలం నరసాపురం గ్రామ జెడ్పీహెచ్ఎస్‌లో ఆమె 9వ తరగతి చదువుతోంది. ప్రతిభ చాటిన విద్యార్థినిని ఆ పాఠశాల హెచ్ఎం బి.శ్రీనివాసులు, పీడీ చల్లా ఓబులేసు, తదితరులు బుధవారం అభినందించారు.

శింగనమల పీఎస్ వద్ద ఉద్రిక్తత



శింగనమల పోలీస్‌స్టేషన్ వద్ద గుమిగూడిన రెండు గ్రామాల ప్రజలు

శింగనమల: స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట బుధవారం ఉదయం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రెండు గ్రామాలకు చెందిన ప్రజల మధ్య పెద్ద ఎత్తున తోపులాట జరగడంతో వారిని పోలీసులు చెదరగొట్టారు. వివరాలు... శింగనమల మండలం నిదనవాడ గ్రామంలో కొన్ని రోజులుగా వ్యవసాయ మోటార్లకు సంబంధించిన కేబుల్ వైర్లు అపహరణకు గురవుతూ వచ్చాయి. దీనిపై బాధిత రైతులు ఫిర్యాదు చేసినా పోలీసుల నుంచి స్పందన కరువైంది. ఈ క్రమంలో తోటలపై రైతులు ప్రత్యేక నిఘా ఉంచారు. మంగళవారం రాత్రి తోటల్లో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఆరుగురు యువకులను బంధించి వివరాలు ఆరా తీసేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో వారు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో తమది పెద్దవడుగూరు మండలం గోపురాజుపల్లి గ్రామమని, కుందేళ్ల వేటకు వచ్చినట్లు సదరు యువకులు చెప్పుకొచ్చారు. బుధవారం ఉదయం విషయం తెలుసుకున్న గోపురాజుపల్లి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో శింగనమల పీఎస్‌కు చేరుకున్నారు. అప్పటికే తమ గ్రామంలో యువకులు సంచరించిన ప్రాంతంలో పడేసిన కటింగ్‌ప్లేయర్, కట్టర్‌ను తీసుకుని నిదనవాడ గ్రామ రైతులూ అక్కడకు చేరుకున్నారు. ఆ సమయంలో ఇరు గ్రామాల ప్రజల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని తోపులాటకు దారితీసింది. దీంతో ఇరుగ్రామాల ప్రజలను ఎస్‌ఐ శరత్‌చంద్ర, సిబ్బంది చెదరగొట్టారు. అనంతరం ఇరుగ్రామాలకు చెందిన కొందరిని తన కార్యాలయానికి సీఐ కౌలుట్లయ్య రప్పించుకుని మాట్లాడారు. ఘటనపై లోతైన విచారణకు సహకరించాలని ఇరు గ్రామాల ప్రజలకు సీఐ సూచించారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళదాం


పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న కేవీ ఉష శ్రీచరణ్

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్

గోరంట్ల: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారం చేపట్టిన తర్వాత నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వ పెద్దలు పూర్తిగా విఫలమయ్యారని, ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతామంటూ పార్టీ శ్రేణులకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కేవీ ఉష శ్రీచరణ్ పిలుపునిచ్చారు. గోరంట్లలో మండల వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని బుధవారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు కూటమి పెద్దలు ఇచ్చిన హామీలన్నీ మోసపూరితమేనని ఈ ఐదు నెలల చంద్రబాబు పాలనలో స్పష్టమైందన్నారు. తల్లికి వందనం పేరుతో ఓ ఇంట్లో బడికి పోయే పిల్లలు ఎందరు ఉంటే అందరికీ రూ.15 వేలు చొప్పున అందజేస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారం చేపట్టిన తర్వాత 'తల్లికి మోసం' తప్ప ఒనగూరిన ప్రయోజనం ఏదీ లేదన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా రూ.20 వేలు, 50 ఏళ్లు పైబడిన బీసీలకు పింఛన్ పంపిణీ హామీలు నెరవేరలేదన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయన్నారు. ఏదోక ప్రాంతంలో రోజూ మహిళల హత్యలు, అత్యాచారాలు, దౌర్జన్యాలు పెరిగి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో హోం శాఖ మంత్రి అనిత విఫలమైనట్లుగా స్వయంగా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పేర్కొనడం చూస్తుంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దేశంలో ఎక్కడ లేని విధంగా ఒకేసారి ఏపీకి 17 వైద్య కళాశాలలను అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాధించుకువచ్చారని గుర్తు చేశారు. దాదాపు నిర్మాణాలు సైతం పూర్తయిన వైద్య కళాశాలలను ప్రభుత్వం నిర్వహించకుండా ప్రైవేట్ పరం చేయడం దారుణమన్నారు. పెనుకొండలో మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను అడ్డుకోవడంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి, పట్టణ కన్వీనర్ మేదర శంకర, జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాంనాయక్, నాయకులు శ్రీచరణ్‌రెడ్డి, రమణారెడ్డి, రాజేంద్రప్రసాద్, బూదిలి శ్రీనివాసరెడ్డి, నార్సింపల్లి రఘురామిరెడ్డి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

సమన్వయంతోనే సమగ్రాభివృద్ధి


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య

అనంతపురం సిటీ: ప్రభుత్వ శాఖల అధికారుల మధ్య సమన్వయం, పరస్పర సహకారంతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా పరిషత్ సీఈఓ ఎల్.వెంకటసుబ్బయ్య అన్నారు. ×పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన× అంశంపై రెండు రోజులుగా ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో నిర్వహించిన శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఈఓ మాట్లాడుతూ... పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళికలు ఎలా రూపొందించాలన్న అంశాన్ని వివరించారు. ప్రజావసరాలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. నిధుల సమీకరణపై అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీ ఆదాయ వనరులను పెంచుకునే మార్గాలను అన్వేషించాలన్నారు. రహదారుల పొడవునా, ఖాళీ ప్రదేశాల్లో వివిధ రకాల పండ్ల మొక్కలు నాటి పెంచి పోషించాలన్నారు. అనంతరం పలు అంశాలపై డీఎల్‌డీఓలు లలితాబాయి(అనంతపురం), నాగేశ్వరరావు(కళ్యాణదుర్గం), ఎంపీడీఓ లక్ష్మీనరసింహ అవగాహన కల్పించారు. ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఆముదం సాగు అనువైనది


ఆముదం పంట పరిశీలనకు వచ్చిన శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

బత్తలపల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు ఆముదం సాగు చేపడితే లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. బత్తలపల్లి మండలం జ్వాలాపురంలో బుధవారం 'ఆముదం సాగు క్షేత్ర దినోత్సవం' కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మంజునాథ్, రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ ఎం.విజయశంకర్ బాబు, జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావుతో పాటు పలువురు జిల్లా, రేకులకుంట పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు హాజరయ్యారు. రైతులు సాగు చేసిన ఐసీహెచ్–5, 66 రకాల ఆముదం పంటలను పరిశీలించారు. పొలాల్లో మందుల పిచికారీకి డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. నామాల పురుగు నివారణకు క్షేత్రస్థాయిలో డ్రోన్ సాయంతో మందు పిచికారీ చేసి చూపించారు. కార్యక్రమంలో రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్.నసీరుద్దీన్, ఎల్.మాధవీలత, భాస్కరరావు, లక్ష్మీకళ్యాణి, కేవీకే కళ్యాణదుర్గం పోగ్రాం కో ఆర్డినేటర్ చంద్రాయుడు, రెడ్డిపల్లి పోగ్రాం కోఆర్డినేటర్ మల్లీశ్వరి, ఏడీఏ కిష్టయ్య, ఏఓ ఓబిరెడ్డి, ఏఈఓ ఉపేంద్రరెడ్డి, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూఏలో వేతన వెతలు


జేఎన్‌టీయూఏ ప్రధాన ముఖద్వారం

అనంతపురం: జేఎన్‌టీయూఏలో పనిచేస్తున్న బోధన, బోధనేతర ఉద్యోగుల వేతన వెతలు వర్ణనాతీతం. జేఎన్‌టీయూఏలో 400 మంది బోధనేతర ఉద్యోగులు, ప్రొఫెసర్లు పనిచేస్తున్నారు. నెలకు రూ.6 కోట్ల వరకు జీతాలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో రెండు నెలలుగా జీతాలు అందక ఉద్యోగులు నానా ఇబ్బందులు పడ్డారు. మూడో నెల ప్రారంభమైనా నేటికీ జీతాలు అందలేదు. దీంతో అప్పులు ఇచ్చే వారు కూడా కరువై కుటుంబ పోషణ ఇబ్బందికరంగా మారిందంటూ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా ఈఎంఐ, వడ్డీ చెల్లింపులు, గృహ రుణం కంతు, పిల్లల చదువులకు ఫీజుల చెల్లింపు, ఇంటి అద్దె తదితర అంశాలకు డబ్బు సమకూర్చలేక ఇప్పటికే పలువురు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించారు. కనీసం క్రెడిట్ కార్డు ద్వారానైనా నిత్యావసర సరుకులు కొనుగోలు చేద్దామంటే నెలకు మించి చెల్లింపులకు గడువు లేకపోవడంతో ఆ కార్డులను ఉపయోగించాలంటేనే భయపడుతున్నారు. క్రమం తప్పకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వ పెద్దలు.. ప్రస్తుతం ఉద్యోగుల సంక్షేమం పట్టనట్టు వ్యవహరిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఏదైనా పని త్వరగా కావాలని ఉన్నతాధికారులు పురమాయిస్తే.. సార్ మాకు జీతాలు అందలేదు. వాటిని ఇప్పించండి.. బాగా పనిచేస్తాం అని బాహాటంగానే చిరుద్యోగులు తిరగబడుతున్నారు.


హెచ్‌ఏపై కేసు నమోదు

కంబదూరు: మండలంలోని తిమ్మాపురం సచివాయం-1 ఉద్యాన శాఖ అసిస్టెంట్ (హెచ్‌ఏ) నరేష్‌కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. 501 బస్తాల వేరుశనగ కాయలు, 30 కంది ప్యాకెట్లకు సంబంధించి రూ.5,28,483 డబ్బును ఆయన తన సొంతానికి వాడుకున్నారు. రోజులు గడుస్తున్నా.. ప్రభుత్వ ఖజానాకు డబ్బు జమ చేయకపోవడంతో వ్యవసాయాధికారి జాఫర్ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ఓబుళపతి తెలిపారు.

వృద్ధురాలి బలవన్మరణం

పెద్దపప్పూరు: మండలంలోని ముచ్చుకోట గ్రామానికి చెందిన రామసుబ్బమ్మ (67) ఆత్మహత్య చేసుకుంది. పక్షవాతంతో బాధపడుతున్న ఆమెకు తోడుగా ఉన్న భర్త గత నెల 30న అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ క్రమంలో ఒంటరి జీవితాన్ని భరించలేని ఆమె బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా, ఆమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనం అపహరణ


బైక్‌ను అపహరించుకెళ్లేందుకు వచ్చిన యువకుడు

గుత్తి: స్థానిక తాడిపత్రి రోడ్డులో నివాసముంటున్న ఎర్రిస్వామి ఇంటి ఎదుట నిలిపిన ద్విచక్ర వాహనాన్ని మంగళవారం అర్ధరాత్రి ఓ యువకుడు అపహరించుకెళ్లాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమయ్యాయి. బాధితుడు ఎర్రిస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.